# మంరికి

(జ్యోతి కథలపోటీలో మొదట బహుమతి పొందిన కథ)

అందమయిన ఇన్ని రోడ్లున్నాయి ...

ఎత్తయిన యిన్ని బిల్డింగులున్నాయి....

ఆకాశంలో రోహిణి తిరుగుతోంది....

దేశం అభివృద్ధి కాలేదంటారేం?

అలా అనేవాడికి దేశాభిమానం లేదు.

దేశభక్తి లేదు.

దేశమంటే ప్రేమలేదు....

వాడు మూర్ఖుడు-

అభివృద్ధి నిరోధకుడు.

చూడు సుబ్రావ్!.... నీ దేశం అభివృద్ధి ఈ బిల్డింగుల ఎత్తులో ఉందా?

ఆరడుగుల పొడుగు పెరిగిన మనిషి గొప్పవాడయినట్లు లెక్కటోయ్?

దేశమంటే మనుషులని ఎందుకన్నారో తెలుసా? అలా అనకపోతే నీలాంటి దద్దమ్మలు పెరిగిపోతున్న ఈ మేడలే దేశం అనుకుంటారు!

ఇంతకీ ఎవరోయ్ నువ్వు? తెగవాదిస్తూ వినిపిస్తావేకాని కనిపించవేం?

చూడు సుబ్రావ్ వినిపిస్తున్నా కదా .. చాలు నామీద పరిశోధన మాని నీ పక్కన ఎవరో నిల్చున్నారు చూడు.

ఎవరది? .. చెవిలో దూది.... ఎముకలమీద అతికించిన చర్మంలా పీక్కుపోయిన మొహం . అతుకుల కమీజు.... వయసు మళ్ళిన పంట్లాం.... బిచ్చగాడయుంటాడు.

"మూడో నెంబర్ బస్సు రాలేదా బాబా?"

"లేదు"

అబ్బో వీడికి బస్సు కావాలిట? బిచ్చగాడు కాదు .. ఆఁ .. ఎందుకాకూడదు. అడుక్కోడంలో ఇదో ఎత్తు మూడోనెంబర్ బస్ రాలేదా బాబా.... నా బిడ్డ దవాఖాన్ల ఉండిబాబా అర్జంటుగా పోవాలె బాబా.... బస్సుల పోదామంటె పైసల్లేవు బాబా.... ఎవరికి తెలియదీ బాబాల సంగతి.

"ఇప్పుడు టైమెంతైతాంది?...."

"ఎంతో అవుతాందిలే...."

చెబితే ఏంటోయ్ సుబ్రావ్ ఎందుకా విసుగు. కోపం? .. ఓ ఆడపిల్లే టైం అడిగిందనుకో, ఇలాగే విసుక్కుంటావా? తడబడకు.... విసుక్కుంటావా చెప్పు"

విసుక్కోవు ...

ఈ మరి ముసలాడు అడిగితే ఎందుకా విసుగు! ముసలాడు కనక ... ముసలిబట్టలేసుకున్నాడు కనక .. అవునా!

"అర్థగంటయింది బేటా ఒక్క బస్సు రాదు .."

ఇందాక బాబా! ఇప్పుడు బేటా! . ఎంత ముద్దుగా పిలుస్తున్నాడు— నీకెంత కావాలో డైరెక్ట్‌గా అడగరాదూ ... ఈ తేనెలెందుకు గుమ్మరిస్తావ్....

"కోఠీ దావఖానకు పోవాలె బేటా .."

అనీ కథ . నేను ముందే అన్లేదు .. ఇది అనుకున్నే కేసే అని. మనిషిని చూడగానే ఇట్లే చెప్పేయగల్ను... వాడే కేటగిరో . ఎలాంటి కేటుగాడో.... ఇప్పుడు వీడి బిడ్డ కాకపోతే కొడుకు కోఠీ దవాఖానలో ఉంటారు. వీడిజేబులో డబ్బులుందవు....

"నెలరోజుల్నుంచి .."

నాకు తెలుసులేరా ... తిండి లేదంటావు అంతేనా?

"నెలరోజుల్నుంచి ఒకటే చెవుపోటు బేటా. కూసుండనీయది.... నిలబడ నీయది...."

నాయకులు పార్టీల మార్చినట్టు వీడు అడుక్కునే పద్ధతి మార్చేశాడు. "నెలరోజుల్నుంచి తిండిలేదు..." కాదట....చెవిపోటు లేస్తున్నదట. నాకెందుకు చెప్పడం!.... అడుక్కోడానికి కాకపోతే?....

"కుంకుమ....నూనె కలిపి పోయమంటే పోసిన కాని ఏడతక్కువైతధి"

ఇదో ఫోజు. వీడింట్లో నిన్నటిదాకా కుంకుమనూనె సమృద్ధిగా వున్నట్లు .. యివ్వాళే కరువైనట్లు—దవాఖానకు పోవాలె.... జేబుల డబ్బుల్లేవు — అనడానికి నాంది.

"ఏదో పనిచేసుకుంటే ఎల్తాది... నొప్పి తోటి ఇంట్ల పంత్తె ఎవ్వలు పెడ్తారు బేటా! ... కొడుకులున్నారు చేసిపెడ్తరు అన్నట్లు లేదు నలుగురూ బిడ్డలే...

"అట్లానా...."

చూశావోయ్ సుబ్రావ్— కొడుకులుంటే తనను కూచోబెట్టి సాదేవాండ్లు అనుకుంటున్నాడు అమాయకుడు. ఉదాహరణకు నువ్వున్నావ్. కోప్పడకు మీ నాన్నను కూర్చోబెట్టి సాదుతున్నావా? నువ్వు టింగురంగా అంటూ పట్నంలో ... ఏ కొడుకు వచ్చి చూస్తాడో నని ఆశతో మీ నాన్న పల్లెలో....

ఏంటోయ్ నీ దూకుడు? నేనే ఎందుకు చూడాలి మా నాన్నను. నాకంటే పెద్దాడు మా అన్నయ్య లేడూ. అది వాడి డ్యూటీ కాకపోతే, ఎంత ఖర్చు పెడుతున్నారో లెక్క చెప్పమను, ప్రతినెలా నా వాటా ఎంతో యిచ్చేస్తా - డబ్బుంటే చాలటోయ్ బ్రతుక్కి....?

నలుగురూ బిడ్డలే .. పెద్దది మొన్ననే పదోటి కామ్యాబ్ అయింది. దాని కేదన్న గింత పని దొరుకుతె....దాని చెల్లెండ్లను అదే చూసుకుంటది. బేటా.... గదే నా ఆశ.... "

వీడి మొహానికో పదో తరగతి పాసైన కూతురా! అయితే అయుండొచ్చు' నకల్ కొట్టి పాసైందేమో.... ఇంతకీ ఎందుకి సోదంతా? వెధవ మొహము వీడూ

బోకర్‌లాగున్నాడు. కూతురున్నది—చదువుకున్నది—అని మాయమాటలు చెప్పి....
మా ఇల్లు యిక్కడికి దగ్గరే ..అని తీసుకుపోయి.. ఓ ఆడదాన్ని చూపించి....
5 రూపాయలు అడిగించి... అమ్మా, నా దగ్గరా యీ నాటకం!... ఆ పప్పులేం
వుడకవు...

ఏ పోవా?... ఉహుఁ... పిల్ల బాగుంది కావచ్చు, ఊఁ... బాగుందేమో..
నిజంగా... చాలా చీప్... ఆఫ్టరాల్ అయిదు రూపాయలు...

అసలు వీడు బ్రోకరేనా?

కాకపోతేపోనీ.. వీడికో కూతురు. పది పాసైంది వుందటకదా-నీ కూతురు
పది పాసైందా.. టైపు నేర్పించరాదూ... ఫరవాలేదు. నేను సహాయం చేస్తా..
ఇంకా చదివిస్తా... ఉద్యోగం యిప్పిస్తా.. ఏదీ మీ అమ్మాయిని చూపించు—
అమ్మాయి బాగానే వుంది— అందంగా వుంది... అప్పుడప్పుడు మీ ఇంటికి వచ్చి
పోతుంటాలేమ్మా . ఒకరోజు... ఈ చీరకట్టుకో ..ఈ పూలు పెట్టుకో... స్టాప్...
స్టాప్... సుబ్రావ్ స్టాప్ . నీ బుద్ధిని పురుగుతింటోంది. నీకు భార్య వుందన్న
విషయం మరచిపోతున్నావ్! ..

ఉంది. ఉంటేనేం? ఇంకెవర్నీ ప్రేమించకూడదా? దేశమును ప్రేమించు
మన్నారు తెలుసా?

ప్రేమించు ఎవరొద్దన్నారు. దేశాన్నే కాదు ప్రపంచాన్నే ప్రేమించు. కాని
కామించకు

నేనేం కామించలేదు. ఈ ముసలాడికో కూతురుంటే ప్రేమిస్తాను అంటు
న్నాను.

ఎందుకు సుబ్రావ్ ఈ దొంగ మాటలు ...

ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ ముసలాడి కూతురు టైప్ నేర్చుకోడానికి,
ఉద్యోగం సంపాదించడానికి నీకు చేతనైన సహాయం చేస్తావా?

అప్పుడే నీవు ప్రేమించినట్లు !

అంటే ఏమిటి నీ ఉద్దేశం? నాకు సెక్సు వాంఛ వుండకూడదా? నేను ఒట్టి
రాయినై పోనా?

రాయికి మాత్రం సెక్స్‌వాంఛ ఉండకూడదని నీకెందుకు నాయనా పట్టుదల? ఉందనీ– నీక్కూడా ఉందనీ కాని... మున్సిపాలిటీ డ్రైనేజి నీళ్ళలా రోడ్లమీద పిచ్చుల విడిగా దొర్లించమాకి!... వివాహం, భార్య అనే పదాలకు అర్థం నీ భార్య ఒక్కర్తి తెలుసుకుంటే చాలు అనుకోకు......

నువ్వు చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి– వాటికోసం నీ సమయాన్ని. శక్తిని వినియోగించు.

ఇందాక అందమైన రోడ్లు అన్నావే...

నీతోటి పౌరులు భిక్షమెత్తుకుంటున్న రోడ్లు నీకు అందంగా కనబడుతున్నాయా?

పనికోసం కూర్చునేవాళ్ళ కళ్ళలోని భయం చూశావా ?

నీ ఇంటిముందు పెంటకుప్ప పేరుకుపోతున్నది  నీ ఇంటినిండా దోమలు వీరవిహారం చేస్తున్నాయి... నీ కొడుకు వాల్‌పోస్టర్ల ముందు దిగాలుపడి కూర్చుంటున్నాడు నీ జీతం నీ కుటుంబాన్ని ఈదవడానికి సరిపోదు, ధరలు మండిపోతున్నాయి... బతుకులు ఎండిపోతున్నాయి! ఆహారంలో కల్తీ... పాలలో కల్తీ... నీళ్ళలో కల్తీ (నీళ్ళలో డ్రైనేజి నీళ్ళు కలుస్తున్నాయి...)

రేపు నీ కొడుక్కు ఉద్యోగాన్నిచ్చి, మంచి బ్రతుకునిచ్చే సమాజాన్ని సృష్టించి కన్ను మూయి...

నువ్వు నోర్మూయి.

వసపిట్టలా ఒకటే వాగుడు...

“ఎంతమంది పిల్లలు బేటా?...”

ఎంతమందైతే వీడికెందుకు.

దశమమంది. చాలా? ఒక్క కొడుకు... ఒక్క కూతురు... అసలు లేరు– నా ఇష్టం. చెప్పను చెప్పన్రా–

డైరెక్టుగా ఓ పదిపైసలు ఇవ్వమని అడక్క... ఈ కుశలప్రశ్నలు... కూపీలు... నక్క వినయం...

నువ్వెప్పుడన్నా అడుగు—

జవాబు సిద్ధంగా ఉంచాను.

"చిల్లర పైసల్లేవు... ఓపో ఈ అడుక్కునే వెధవల్ని షూట్‌చేసి పారేస్తే గాని ఈ దేశం బాగుపడదు,

"కొలువుకా బేటా..."

లే, వల్లకాటికి—వస్తావా?

"ఇల్లు ఇక్కడేనా?"

ఏం ఇక్కడ అడుక్కునేది చాలక ఇంటికూడా వస్తావా? ఏబ్రాసి మొహమూ వీడూ. రాస్కెల్...

చెప్పను

ఎప్పుడయినా వెంటబడి ఇల్లు చూస్తాడేమో- శనిలా ఇంటిచుట్టు తిరగడు కదా... రేడియో...కొత్తది...మొన్ననే అత్తగారు పెట్టింది...ఫ్యాను.. కొత్తది. అత్తగారు పెట్టింది...భార్య...కొత్తది...అత్తగారు పెట్టిందే...ఏమిటేమిటి భార్యా! కాదుకాదు బాసన్‌లు...వెండివి.. స్టీల్‌వి...అత్తగారు పెట్టినవి..బొడ్డుగిన్నె బంగారుది..అత్తగారు పెట్టింది...కొత్తచెప్పులు...డిటో..డిటో. ఇంటికొస్తే వెధవని తన్ని తరిమేయనూ.

నేను లేనప్పుడొస్తాడేమో. "అయ్యగారు పంపించారండి" అని డబ్బులు అడుక్కుపోడు కదా... సామానులు ఎత్తుకుపోడు కదా...

ఎందుకైనా మంచిది-వినయంతో చెప్పాలి నేను లేనప్పుడు ఎవరైనా వస్తే తలుపు తెరవకు- దొంగవెధవలు మూర్ఛమందులు చల్లి ఇల్లు దోచుకపోతారు మాయమందులు ప్రయోగిస్తారు.

వీడు దొంగకాడు అడుక్కునేవాడేమో-! ఇదేదో సూటిగా అడుక్కోక యిన్ని మాటలెందుకు? తీపితీపి మాటలు మాట్లాడి పర్సు లాగాలనా ..ఒక్కపైసా యివ్వను.

అదిగో జేబులోంచి ఏదో తీస్తున్నాడు… తెల్లగా వుంది… కాగితం!. . . దాని కే మందో మాకో పూసి… అవన్నీ నా దగ్గర సాగవు. అసలు నేను ముట్టు కోనే ముట్టుకోను.

"కోఠీల సర్కార్ దవాఖాన వుంది సూడు బేటా… పోయిన వారంల పరీచ్చ చేసి ఇండ్ల రాసిండ్లు-మల్ల రమ్మన్నరు ఇయ్యాల ..

"ఉండనీ, జేబులో పెట్టుకో… ఎక్కడన్నా పోతది-"

"నీకు చూపిస్తనని తీసిన బేటా…"

నాకు చూపించడమెందుకు? వీడు దవాఖానకు పోతున్నానని నాకు ఋజు వులు చూపించడమెందుకు?

ఆ మాట చూడు… నూతి అడుగునుంచి వచ్చినట్టు… నాకు తిండిలేదో అని నటన…దొంగరాస్కెల్..

అప్పట్నించి చూస్తున్నాను నా వుంగరంమీదే వీడి కన్నంతా - కొత్తది మొన్ననే పండక్కి అత్తగారు పెట్టింది.

పెట్టిందా, వసూలు చేసిందా?… నిన్ను నోరుమూసుకోమన్నానా?

"ఏం కాలమైపాయె బేటా… ధరలు మండిపోతానయి…"

"ఊఁ…"

"నా చిన్నతనంల రూపాయి పెడితె రెండు కుంచాల బియ్యం- మా అయ్యకు నాలుగు రూపాయల జీతం…"

"ఊఁ ."

జీతాలు పెంచమని కొట్లాడుతరు గాని . పాయిదేమున్నది?… ధరలు తక్కువజేయిండ్లని కొట్లాడాలెగాని"

"ఊఁ…"

మాట్లాడు…నువ్వెందుకు మాట్లాడుతున్నావో…నాకు తెలును… మాట్లాడు-

"అరేయ్ ముసలోడా గంటి కొడ్తాంటె ఇనపడ్తల్లేదురా…జరుగు" రిక్షాలో కూర్చున్నవాడి కసురు.

"ఇనబద్తె పక్కకు జరగవా బేటా .. జెర గంత కోపమెందుకు?.

ఎందుకా...నువ్వేంటో ఆ రిక్షాలో కూర్చున్న వాడికి బాగా తెలుసు. రోజూ చుస్తున్నట్టున్నాడు.

"ఆ వచ్చే బస్సు మూడో నెంబరేనా భేటా?'

ఆఁ.. ఆఁ...జరగండి...జరగండి... హటో హటో...హమ్మయ్య...ఎక్కాను౼బట్టలు నలిగిపోవద్దు అనుకుంటే... ఫరవాలేదులే సీటు దొరికింది. సీటు... అరె వీడు నా పక్కనే ఉన్నాడేం... దరిద్రపు వెధవ౼ఇక్కడా దాపురించాడు౼ వీణ్ని చుస్తేనే డోకు౼అసహ్యం.

ఇంతసేపు నాతో మాట్లాడింది...ఇప్పుడు నా పక్కన చేరింది... టికెట్ నాచేత తీయిద్దామనే కదా...

నేనా నీకి తీసేది!

డబ్బుల్లేకపోతే నడచిపోవా...

బస్సెక్కుతాడా!

పైగా నా పక్కన కూర్చుంటాడా!

చూడు సుబ్రావ్... అతడు నీకోసం సీటు ఆపాడన్న కృతజ్ఞతైనా లేదేమోయ్ నీకు?

అదే...నాకు సీటెందుకు ఆపాడంటావ్? వాడి టికెట్ నేను తీసుకోవాలనే కదా...కాకపోతే వాడి టికెట్‌కు తక్కువపడిన డబ్బులు ఇవ్వాలనే కదా...

"మంచిగ కూసో బేటా..."

కిటికి పక్కకు జరిగి కూర్చుంటాడు.

నీ బేటా... నీ నక్క వినయం...నువ్వు పక్కకు జరిగి కూర్చోడం.... అన్నీ నాకు తెలుసు ...

ఒక్క పైసా ఇవ్వను

ఇవ్వొద్దు.

ఘాట్ చేసి పారేయాలి ఇలాంటి వెధవల్ని.

వెధవ న్యూసెన్స్....

టికెట్....

టికెట్....

"ఏయ్ తాతా ఏటు?"

జేబులు చూడు ఎలా తడుముకుంటున్నాడో...

పైసలున్నట్టే!....

ఓ గుడ్డ తీశాడు—

అందులో పైసలుండవు.

ఇంతసేపు వీడి మాటలు విన్న ఖర్మానికి. వీణ్ని భరించిన ఖర్మానికి....

"ఒక్క చారానా ఉన్నదాకీబేటా " అని అడుగుతాడు

కోట్లు దాచుకున్నట్టే!....

ఆ గుడ్డకు ... ముడిమీద ముడి....

వాడివైపు చూడొద్దు—

చూస్తే డబ్బులడుగుతాడు—

....

ఒక సెకండ్

రెండు సెకండ్లు....

ఇంకా అడగడేం!....

డబ్బులు తీసి కండక్టర్ చేతిలో పెట్టాడు.

అవి తక్కువుంటాయి

నావైపు "బేటా...." అని నవ్వుతూ చూస్తాడు ...వాడి నవ్వు చూస్తేనే రోత.

కండక్టర్ చూసుకొని ...బ్యాగ్‌లో వేసుకున్నాడు!

టికెట్ ....కూడా ఇచ్చేశాడే!

. . .   . . .

మొహం అలా పాలిపోయిందేం సుబ్రావ్!

"ఎక్కడికి పోవాలి సార్?"

"ఊఁ .."

టికెట్...

"కోఠీ..."

ఇదిగో

"పది..,ఇరవై.. నలభై అయిదు.. ఇంకో పదిపైసలు సార్ ."

"ఇంకో పది పైసలా!"

పై జేబు  పక్కజేబులు  పైజేబు — పక్కజేబులు.

ఊహుఁ .

ఇంకో రౌండ్ —

పై జేబు.. పక్కజేబులు..

"ఇంకో పది పైసలా! ..ఛార్జీలు పెరిగినయా?"

"జల్దిన తీయండి సార్. .పెరిగినయని పేపర్ల పడింది గదా..."

పై జేబు .

పక్కజేబులు రెండు కులే—

"చిల్లర లేదు—"

"ఎంతుంది సార్?"

ఫిఫ్టీ రూపీస్...

"అంత చిల్లరా!... ఇదే ఫస్టుట్రిప్ వస్తే ఇస్తా ఇవ్వండి..."

"రాకపోతే?..."

"టికెట్‌మీద రాసిస్తగదా డిపోకొచ్చి తీసుకోండి..."

మా ఇంటినుండి డిపోకు... నాలుగు రూపాయలు ఖర్చుపెట్టుకొని రానా! ఇంత ఖచ్చితమైతే ఎలాగోయ్? పదిపైసలే కదా తక్కువైంది. మరోసారి కలిసి నప్పుడిస్తాలే...—"

"అదేం కుదరదు చిల్లరివ్వండి. లేకపోతే దిగిపోండి. మీ ఒక్కరి దగ్గర్నే ఇంత సేపు నిలబడ్తె ఎట్లా?"

టంగ్...

రోకో భాయ్—

అరె పోనీయవయ్యా కడక్టరూ ఇప్పటికే ఆలస్యమైంది... "అరుపులు... కేకలు—"

"దిగండి సార్..."

టైమెంత? అమ్మో పదా! ఇంకో బస్ దొరకదు ఆటోలో పోతే? ఆర్రూపాయలు! పదిపైసలకోసం ఆర్రూపాయలు వేస్తా!

ముసలాడు జేబులోంచి గడ్డతీసి.... "నాకు ఆటెంక ఇద్దుపులే బేటా... ఈ పది పైసలు కలిపి ఇయ్యి..."

ఊఁ!... కండక్టర్ తీసుకొని... టికెట్ ఇచ్చి...రైట్...రైట్...రైట్ బాయ్!

...చలో-

ఏం, అలా తలవాల్చేశావ్...ముసలాడి మొహం చూడాలంటే సిగ్గుగా ఉందా సుబ్రావ్!